క్లుప్తంగా

ఎన్ఎస్‌పీ పేరుతో ట్రస్ట్ ఏర్పాటు

నరసాపురం: నరసాపురంలో మరో ట్రస్ట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త బొమ్మిడి రవి శ్రీనివాస్(ఆర్‌కే) నరసాపూర్ సంక్షేమ సమితి(ఎన్ఎస్‌పీ) పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేశారు. సోమవారం నరసాపురం ప్రెస్‌క్లబ్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ కార్యకలాపాలపై వివరాలు వెల్లడించారు. గతంలోనే తాను అనేక సేవా కార్యక్రమాలు నరసాపురం కేంద్రంగా చేశానని గుర్తు చేశారు. వ్యాపార కార్యకలాపాల్లో భాగంగా వేరే ప్రాంతంలో ఉండడం, ఖాళీలేని కారణంగా వాటిని నిలుపుదల చేశానని చెప్పారు. ఎన్ఎస్‌పీ పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి తిరిగి సేవా కార్యక్రమాలు ప్రారంభిస్తోన్నట్టు చెప్పారు. పేద, మధ్య తరగతి వారి విద్య, వైద్యానికి సంబంధించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే నియోజకవర్గంలో దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి ట్రస్ట్ తరపున కృషి చేస్తానని చెప్పారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పెనుగొండ: ఉపాధి పనులు నిర్వహించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే పాదుషా డిమాండ్ చేశారు. సోమవారం నడిపూడి చింతలపాలెంలో నిర్వహిస్తున్న ఉపాధి పనుల ప్రాంతాలను సందర్శించి ఉపాధి కూలీలతో సమస్యలపై చర్చించారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి పనులకు తూట్లు పొడవడానికి నిధులు కోత విధిస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు కప్పల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు మండల వ్యవసాయాధికారిగా రహీమ్



ఎస్.అబ్దుల్ రహీమ్

మొగల్తూరు: మండల వ్యవసాయాధికారిగా ఎస్.అబ్దుల్ రహీమ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఎం సుజాత అనంతపురం బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ఎస్ అబ్దుల్ రహీమ్ పూర్తి స్థాయి ఏఓగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు గతంలో కొద్దికాలం పాటు ఈ ప్రాంతంలో పని చేసిన అనుభవం ఉంది

చురుగ్గా కాలువలో పూడికతీత పనులు



నరసాపురం ప్రధాన కాలువలో పూడికతీత పనులు జరుగుతున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం ప్రధాన పంట కాలువ పూడిక తీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత నెల 19న ప్రారంభమయిన ఈ పనులు సీతారాంపురం సెంటర్‌వరకూ దాదాపు పూర్తికావచ్చాయి. నరసాపురం మేదర్ల వంతెన వద్ద నుంచి మొగల్తూరు వరకూ ఈ కాలువలో ఉన్న గుర్రపుడెక్క, చెత్త తొలగించి పూడికతీతను యంత్రం సాయంతో తీస్తున్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం కలుగకుండా ఉండే విధంగా కాలువ పూడిక తీత కోసం రూ.28 లక్షల నిధులతో ఈ కాలువ ప్రక్షాళన పనులు చేపట్టారు. దిగువ ప్రాంతాల రైతులకు తాగునీటి ప్రాజెక్టులు చెరువులు నింపేందుకు ఈ కాలువ పూడిక తీత ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు, ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షీరారామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో క్షీరారామలింగేశ్వరుడు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, జనార్ధనస్వామికి అర్చనలు, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు కుంకుమ పూజలు, గోపూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతులు ఇచ్చారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: మానవజాతి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా సీతారాంపురం సౌత్ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. మానవజాతి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడం ఒక్కటే మార్గమని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించి క్యాన్సర్‌ను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పర్యావరణ సమతుల్యతను పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో తొలుత గ్రామంలో ప్రధాన రహదారి పక్కగా మొక్కలను నాటి, నీరుపోశారు. నాటిన మొక్కల పర్యవేక్షణను పట్టించుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో భాగంగా తడి, పొడిచెత్త వేరుచేసే డబ్బాలను పంపిణీ చేశారు. అనంతరం ప్లాస్టిక్ రహిత పచ్చని స్వచ్ఛ గ్రామంగా పేర్కొంటూ ముద్రించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, సర్పంచ్ దొండపాటి వెంకటేశ్వరరావు, దొంగ మురళీకృష్ణ, జేవీఆర్, బ్రహ్మాజీ, అయ్యప్పనాయుడు, దుర్గా ప్రసాద్, మైలాబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని సంరక్షించాలి..

నరసాపురం: పర్యావరణాన్ని మనం సంరక్షిస్తే అది మనల్ని కాపాడుతుందని నరసాపురం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ అన్నారు. మండల న్యాయ సేవాసంస్థ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం మంచి మార్గమన్నారు. పర్యావరణ పరిరక్షణకు మనవంతు సాయంగా ప్లాస్టిక్ వాకడం మానేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామన బుజ్జి, న్యాయవాదులు సీహెచ్ దాన్యనాయుడు, పూరిళ్ల శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, జీఎం వల్లభరావు పాల్గొన్నారు. స్థానిక ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న ఉచిత వేసవి విజ్ఞాన తరగతుల్లో పుస్తక పఠనం, యోగా, చెస్, పద్యాలు చదవడం, న్యూస్ పేపర్లు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. సనార ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి, ప్రముఖ రచయిత చేగొండి సత్యనారాయణమూర్తి, సైంటిస్ట్ సుబ్బారావు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పర్యావరణాన్ని రక్షిస్తే ఆ పర్యావరణమే మనల్ని రక్షిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్. టి. రాజరాజేశ్వరి తెలిపారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మన పరిసరాలను కూడా అంతే శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మానవహారం ఏర్పాటు చేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి సుబ్బలక్ష్మి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వై విజయ్‌కుమార్, కుమారి, వి.సాయి తదితరులు పాల్గొన్నారు. స్థానిక అలాగే జీపీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కెనరా బ్యాంక్ మేనేజర్ బాల వెంకట్, హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా 29వ రోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వి.వెంకట్రావు, కొల్లాబత్తుల సూర్యకుమార్, గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి, మేరి, నాగమణి పాల్గొన్నారు.



నరసాపురం రూరల్: సీతారాంపురం సౌత్‌లో డస్ట్‌బిన్‌లను పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ ముదునూరి

పోడూరులో

పోడూరు: పర్యావరణానికి ఎనలేని ప్రయోజనాలు చేకూర్చడానికి ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైహెచ్ఏఐ) పాలకొల్లు యూనిట్ అధ్యక్షులు పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిన్నూరులోని శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో వైహెచ్ఏఐ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ పాలకొల్లు యూనిట్ అధ్యక్షులు కారుమూరి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు డాక్టర్ కేఎస్‌పీఎస్ వర్మ, సహాయ కార్యదర్శి సొలస సుబ్బారావు, మాజీ అధ్యక్షులు శిఖాకొల్లు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి రామలక్ష్మణ్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిన్నూరులోని శ్రీ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన ప్రభ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నంతరం తాళాబత్తుల వీరభద్రకుమారి ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లతో అందమైన బొమ్మల తయారీపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జిన్నూరు శాఖా గ్రంథాలయంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై ఈ నెల 7న విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, 8న వ్యాస రచన పోటీలు, 9న వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకురాలు బత్తుల జోగారత్నం తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెనుగొండ: పర్యావరణ కాలుష్యం పెరిగిపోతుండడంతో అనేక అనర్థాలు తలెత్తుతున్నాయని, వీటి నివారణకు పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా స్వీకరించాలని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. సోమవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్, ఎకో క్లబ్, జువాలజీ విభాగాలు సంయుక్తంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు టి దివాకర్, పి.మీరయ్య, ఎకో క్లబ్ కన్వీనరు డాక్టర్ కే శ్రీలక్ష్మీ, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.లక్ష్మీ కాంతమ్మ, అటానమస్ అసిస్టెంట్ కంట్రోలర్ పీఎస్ ఫణి కృష్ణ, పీడీ డాక్టర్ బి.బాపిరెడ్డి, నేమాని శ్రీనివాస్, టి.నరేష్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొడమంచిలిలో

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొడమంచిలి పంచాయతీలో ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు, కొడమంచిలి సర్పంచ్ సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామాలలో ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రేవతి, ప్రియదర్శిని, పుష్పరాజ్యం, రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి శ్రీనివాస్



పాలకొల్లు సెంట్రల్: ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల వద్ద మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



పోడూరు: జిన్నూరులో మొక్కలు నాటుతున్న యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు, విద్యార్థులు



పెనుగొండ: ఎస్వీకేపీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

కమ్యూనిటీ భవన నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలి

పెనుగొండ: నియోజకవర్గంలో చేపట్టిన కమ్యూనిటీ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశించారు. సోమవారం తూర్పుపాలెంలో కమ్యూనిటీ భవన నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఆచంట పట్టణంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసిన కమ్యూనిటీ భవన నిర్మాణాలు సత్వరం ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో 100కు పైగా కమ్యూనిటీ భవన నిర్మాణాలకు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ప్రతి వర్గానికి కమ్యూనిటీ భవనం సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో పోడూరు జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పెనుమంట్ర ఎంపీపీ కేవీ నారాయణ రెడ్డి(వాసు), పార్టీ నాయకులు కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కమిటీ నియామకాలు చేపట్టాలి

నియోజవర్గంలో ఎస్సీ సెల్ కమిటీల నియామకాలు పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. నూతనంగా నియామకమైన ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పోతుమూడి రామచంద్రరావు, పెనుమంట్ర మండల ఎస్సీ సెల్ కన్వీనరు బుర్రా రవికుమార్, పోడూరు మండల ఎస్సీ సెల్ కన్వీనరు బుడితి భీమారావు, పెనుగొండ మండల ఎస్సీ సెల్ కన్వీనరు పలివెల శ్రీను, ఆచంట మండల ఎస్సీ సెల్ కన్వీనరు కొండేటి రమేష్‌లు మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

పోడూరు సమస్యలకు పరిష్కారం

పోడూరు మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం తూర్పుపాలెంలో సమస్యలపై పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. చింతల తోట రామాలయ నిర్మాణానికి సహిస్తామని వివరించారు. అదేవిధంగా ఏడు బీసీ , శెట్టి బలిజ పాలెంల్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, సర్పంచ్ సువర్ణరాజు, రుద్రరాజు శివాజీరాజు, చేకూరి సూరిబాబు, బాలా ఏడుకొండలు పాల్గొన్నారు.



ఆచంట కమ్యూనిటీ భవన నిర్మాణాలపై తూర్పుపాలెంలో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో ఎస్సీ కమిటీ నియామకాలపై మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ సెల్ మండల కన్వీనర్లు

లోఓల్టేజ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

పెనుమంట్ర: మండలంలోని నెగ్గిపూడి గ్రామ పంచాయతి పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మాజీమంత్రి స్థానిక శాసనసభ్యుడు చెరకువాడ శ్రీరంగనాథరాజు విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇటీవల గ్రామ సమస్యలపై ఆ గ్రామ మహిళలు శ్రీరంగనాథరాజును కలసి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన సోమవారం గ్రామంలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మకాలనీలో తక్షణమే 63కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి లోఓల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని అదే విధంగా కాలనీలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా అగ్రికల్చరల్ ఫారమ్ రోడ్డులో పంటబోదెపై పంచాయతీ నిధులతో కల్వర్టు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డును పరిశీలించి రోడ్డును వెడల్పుగా నిర్మించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ డీఈ రాంబాబు, విద్యుత్‌శాఖ ఏఈ బాపూజీ, ఎంపిడీఓ వి.పూర్ణబాబ్జీ, సర్పంచ్ మామిడిశెట్టి ధనలక్ష్మి, ఎంపిటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు అల్లం బాస్కరరెడ్డి, ఉపసర్పంచ్ అల్లం బాలసాయిరెడ్డి, వైఎస్సార్ సీసీ నాయకులు అల్లం బులిరెడ్డి, పాలసత్తి రాజా, సత్తి వెంకటరెడ్డి, తదితరులు పల్గొన్నారు.

రాంబాబు కుటుంబానికి సాయం

పాలకొల్లు సెంట్రల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యునైటెడ్ కాపు క్లబ్ సభ్యుడు యెనుముల రాంబాబు కుటుంబానికి సోమవారం క్లబ్ సభ్యులు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. క్లబ్ అధ్యక్షులు పెనుమాక రామ్మోహనరావు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని అన్నారు. హెల్మెట్ లేకపోవడం వల్ల జరిగే ప్రమాదానికి ప్రాణాలు పోతే ఆ యజమానిపై ఆధారపడ్డ ఆకుటుంబాలు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. సేవా సంస్థలు అందించే సహాయం ఆ కుటుంబాలకు అంతంత మాత్రమే తప్ప ఆ ఇంటి యజమాని లోటును మాత్రం తీర్చలేవని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి తమ కుటుంబాలకు రక్షణగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జక్కంపూడి మదన్, కానూరి ప్రభాకర్‌రావు, గాది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువు విస్తరణ పనుల ప్రారంభం

పాలకొల్లు అర్బన్: మంచినీటి చెరువు విస్తరణతో గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు పూర్తిగా తీరిన ట్లేనని సర్పంచ్ కవురు భారతి అన్నారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ మంచినీటి చెరువు విస్తరణ పనులను సోమవారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గతంలో ఎకరన్నరలో మంచినీటి చెరువు ఉండేది. దీంతో వేసవి కాలంలో గ్రామ ప్రజలకు మంచినీటి అవసరాలు పూర్తిగా తీరేవి కావు. ఈ సమస్యను పరిష్కరించడానికి సర్పంచ్ భారతి, వైఎస్సార్ సీపీ నాయకులు కవురు భాస్కరబాబు తదితరులు గ్రామానికి చెందిన గొల్లమందుల పోలు అనే రైతు నుంచి సుమారు 20 సెంట్లు భూసేకరణ చేశారు. చెరువు విస్తరణకు మార్గం సులువైంది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెదపాటి వెంకటరత్నం, మాజీ సర్పంచ్ దాసరి లాజరు, పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా), గ్రామ పెద్దలు కవురు గాంధీ, యాండ్ర రామకృష్ణ, ధనకొండ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో మంచినీటి చెరువు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కవురు భారతి

మార్టేరు పరిశోధన స్థానంలో రైతులకు సత్కారం

పెనుమంట్ర: వరి పరిశోధనా స్థానంలో అధిక దిగుబడులను ఇచ్చే వరి వంగడాలను రూపొందించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.భరత్‌లక్ష్మి అన్నారు. సోమవారం పరిశోధనాస్థానంలో జాతీయ విత్తన దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు రైతులను సత్కరించారు. ఈ కర్యాక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఎకరాకు 60 బస్తాల దిగుబడి ఇచ్చే రకాలను తయారు చేయడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ (వరి) డాక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు రూపొందించేందుకు రైతులు క్షేత్రస్థాయిలో మెలకువలు పాటించి నాణ్యమైన విత్తనాలను రూపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంటీయూ 1232, ఎంటీయూ 1293 రకాల వరి విత్తనాలను మినీ కిట్ల రూపంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా విత్తనోత్పత్తి చేసే జి.సోమశేఖర్‌రెడ్డి (కవిటం), జి.నాగరాజు (భట్లమగుటూరు), ఎం.శ్రీనివాసరావు (ఇరగవరం), ఎస్.ఏసుబాబు (గుంపర్రు), పులవర్తి బాబ్జీ (మార్టేరు) రైతులను సత్కరించారు. శాస్త్రవేత్తలు వై.సునీత, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యువతుల కోలాట ప్రదర్శన



కొంతేరులో శ్రీకుంతీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కోలాట భజన చేస్తున్న యువతులు

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీలక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి దేవేరులకు ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో అర్చకులు మాధవాచార్యులు పుష్పయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ముక్కామలకు చెందిన కేశవ ఆంజనేయస్వామి భజన మండలి యువతులు చేసిన కోలాట భజన భక్తులను అలరించింది. ఈ కోలాటాన్ని శ్రీకుంతీ లక్ష్మీనరసింహస్వామి యూత్ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ నెల 11న ఆదివారం గ్రామస్తులు, భక్తుల సహకారంతో అఖండ అన్నసమారాధన నిర్వహించడంతో ఈ ఏడాది వార్షిక కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ చెప్పారు.

పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు



పోడూరులో స్టాక్ పాయింట్ నుంచి విద్యా కానుక కిట్లను పాఠశాలలకు తరలిస్తున్న దృశ్యం

పోడూరు: వేసవి సెలవుల అనంతరం త్వరలో ప్రభుత్వ పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు 'జగనన్న విద్యాకానుక' కిట్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ చర్యల్లో భాగంగా ఇప్పటికే పోడూరు మండల కేంద్రంలోని స్టాక్‌పాయింట్‌కు విద్యాకానుక సామాగ్రి సరఫరా చేశారు. స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని పలు పాఠశాలలకు సోమవారం విద్యా కానుక కిట్లు తరలింపు చేపట్టారు. ఎంఈఓ ప్రేమజ్యోతి పర్యవేక్షణలో సీఆర్‌పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు కిట్ల పంపిణీ పనులు నిర్వహిస్తున్నారు.

నేడు అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

సాక్షి, భీమవరం : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 10 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించనున్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం ఇక్కడ ఏర్పాటుచేసిన అంబేడ్కర్ సిమెంట్ విగ్రహాన్ని తొలగించి ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం మండలశాఖ ఆధ్వర్యంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారు.